# అనాకారీ, కురూపీ అంటూ రావీధివాళ్లంతా ఆవిణ్ణి

చిన్న కథ

'ఈ పీనుగులేనా అందం, అందం అంటూ మహాగర్విస్తారు! అందంట. పరాయి మొగాడు పారేసుకున్న జేబురుమాలు దాచుకొని దాని తోటి ప్రణయతంత్రం నడపడం అందమా? కాలేజీ వరండాలమీద క్లాసుమేట్సుని డీకొట్టడం అందమా? పరాయి మొగాడింటికొస్తే బట్టిప్పుకొని మాట్లాడ్డం అందమా?'

రచయిత:

## విద్వాన్ పాలెపు వెంకటరత్నము

౧

ఉత్త అనాకారీ కురూపీ అంటూ రావీధివాళ్ళంతా ఆవిణ్ణి. నాకేమో ఆవిడ కురూపితనం కనబళ్ళే, ముతకఖద్దరు చీరే కడుతుంది. గుత్తమైనరైక కొంచెం పొడుగుచేతుల్ది తొడుక్కుని క్రిందుగా గుండెలమీద కాకుండా మెడదగ్గిరే నూదిబొత్తాం పెట్టుగుంటుంది. నుదుట డబ్బుకాసంత కుంకం బొట్టు. చాయ కొంచెం నలుపే అని చెప్పొచ్చు. అయితేనేం?

భాగవతం తీసుకుంది. రాటానికి కదు రమిర్చింది. సన్ననూలు వొడుకుతోంది.

పదుకొండవ్వొస్తోంది. బనీను తొడుక్కుంటున్నాను. డ్రెస్సవడానికి మొదలు. మాయ డ్రెస్సు.

ఆవిడ చదువుతోంది నూలు వొడుకుతూ: 'అంధేందూదయముల్, మహాబధిరశంఖారావముల్, మూకసద్గ్రంథాఖ్యాపనముల్' —

'బధిరశంఖారాముల్,
మూక సద్గ్రంథాఖ్యాపనముల్.'

స్పష్టమైన ఉచ్చారణ. అదే అందం అనుకున్నా.

పంచకట్టుకొని షర్టు తొడుక్కొని వరండాలో కొచ్చాను.

'అన్నగారూ! దేవయాని చరిత్ర చెప్పరూ.'

'అలాగేనమ్మా! స్కూలునించి రాంగానే చెపుతాను'

ప్రక్కయింటి శకుంతల కాలేజీకి వెడుతోంది. మమ్మల్ని చూచింది. ఒంగుని నవ్వుకుంటూ పోతోంది. నిలబెట్టి అడుగుదామను కున్నాను.

'—చాల్లే. సంతోషించారు! ఎందు కాఇగిలింపు? అవతల షెల్లీ కవికి చెడ్డావు—ఇవతల పోతన్న కవికీ చెడ్డావు. వాలుజడమీద నించి పైటచెంగుమాత్రం రాని చ్చావు ఫేషను. ఏమి అర్థమైంది చెప్పు ఆ లావుపాటి ఇంగ్లీషు పద్యాల పుస్తకం నీకు. నోటిబుక్కు కటుచ్చుకుని, చేతులోని ఫౌంటెను పెన్ను పెదవులమీద పెట్టుకుంటూంటా వంతే.'

మూరుమార్కెట్టులో కొన్న చాపతు జోడు టక్కుటిక్కు లాడించుకుంటూ శకుంతల సందుమళ్ళింది. నా కోపమూ తగ్గింది.

'లీలా! లీలా!'

'ఏం?'

'ఏంలేదు గింలేదు. ఇలారా సూరమ్మక్కగారు 'గీతగోవిందం' నేర్పుతారు చక్కగా నేర్చుకో.'

'సరే లోపలికిరండి కోటు తొడుక్కోడానికి.'

'ఏమి టంటున్నారు'

'అష్టపదులు నేర్చుకోమంటున్నాను.'

తాంబులమిచ్చి 'శాంతాఆప్టే' లాగు తిరుగుతూ

'అపనే-మురుఖ్‌కో ప్రేమసిఖాయా'

అని మొదలెట్టింది.

నేను 'నీమొఖం సిఖాయా' అంటూ గుమ్మందాటి సైకిలెక్కి 'పెడల్‌తొక్కాను. ఇంకీవిడ సాయంత్రందాకా 'గ్రామఫోను'దగ్గిర సిద్ధం.

౨

పికారుపోయి ఇంటికొచ్చాను. సూరమ్మగారు వంట చేసేసుకొని గ్రంథపఠనం చేస్తోంది.

'మందారవనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలోత్పలపర్యంక రమావినోది. .'

'ఆహాహా! ఏమిడచ్చారణండీ, అక్కగారూ! మీంది. అదే అందం అంటే' అవి లోప లనుకున్నా.

'అన్నగారూ! చూడండి: ఖద్దరు తువ్వాళ్లు మొన్నటి నూలుతో నెయ్యించిన వివి.'

'బాగున్నాయండి!' సిల్కు వాటిల్లాగున్నాయి'

రాఘవుడొచ్చాడు——

'సూర్యం'

'ఏరోయ్!'

'రావోయ్! వెధవ బాతాఖానీ నువ్వూనూ.'

'ఒరేయ్! అలా అనబోక'

'నీమాటే కానియ్యరాబాబూ! కానీ రాముడు పెళ్ళికొచ్చావు కావేం'

'ఏమిటో ఎక్కడ తీరుబడిరా!'

'నువ్వొక్కడొస్తావోయ్'

'అలాంటేకాదు. అక్కడికొస్తే అదంతా మహిళామండలం. నాకు సిగ్గు. ఏమోయ్ సూర్యం అనీదొకావిడ, ప్రియమైన సూర్యారావు అనీ దొకావిడా, షెక్‌హ్యాండు ఇమ్మనీ దొకావిడాను. ఏదీ విశ్వనాథ సత్యనారాయణగారి పద్యం ఒక్కటి నోటపట్టించి చదవమను.'

'బాగానేఉంది ఉపన్యాసం!'

'బాగుకేంకాని బ్రౌనింగు కవి గ్రంథం ఇచ్చావురా దేంరా!'

'నే నిచ్చేదేమిట్రా, సావిట్లోనే గది. చక్కగా తెరిచి ఉంటుంది. నీకు తీరుబడి అయినప్పుడు ఒచ్చి స్వంతంగా సెల్ఫులోది పట్టుకుపోక.'

'బాబూ! మీయింటికొచ్చినా నాకదేభయంరా.'

'ఏడిశావు, రావోయ్! పిరికిపందా! నే పోతామరి. రామారావు రమ్మన్నాడు. తప్పకుండా రావోయ్.'

గుమ్మందాటాడు. వాడి జేబురుమాలు పడిపోయింది. నేను లోపలికెళ్ళగా చూచి లాగేస్తోంది లీల.

'హాసి పీనుగా! ఇంతకీ నిన్నన వలసినపని లేదులే. కాలం!'

సూరమ్మగారి పాట నన్ను శాంతుణ్ణి చేసింది.

'——నీలమేఘశరీర - నిత్యానందదేహా——'

౩

బ్రౌనింగు చదవాలని ఉబలాటంగా ఉంది. అక్కడికి వెళ్ళడానికిసిగ్గు. తెగించాను. ఉదయాన్నే వెళ్లాను. వీధితలుపూ, రాఘవుడి గదితలుపూ తెరిచే ఉన్నాయి. తిన్నగా గదిలో కెళ్లాను. సెల్ఫులో పుస్తకం కనబళ్ళేదు. అల్మారాకేసి తిరిగాను– ఖర్మంగాలి.

అప్రక్కనే చిన్నతరండా. దాన్నానుకొని ఆడాళ్ళ స్నానపుగది. రాఘవుడి చెల్లెలు లలిత స్నానం చేస్తోంది అర్థనగ్నంగా. పదినిముషాలపాటు సెల్ఫు వెతికానా? అటుచూడేలేదా? నన్నుచూచి పారిపోవాలా? అబ్బే కనిపెట్టుకొని నించుంది కాబోలు నేనటుచూచీదాకాను. వాళ్ళనాన్నగారు తెచ్చిన జపాన్‌స్నానపుదుస్తులు కడితేమాత్రం! వాటి కేమేనా మరుగా? ఒల్లకాడా?

సద్దుకోబోయి కాబోలు తఖుక్కుమనిపించింది...'ఛీ!ఛీ! ఎక్కడపుట్టింద్రా దేముడా? బొత్తుగా సిగ్గు బిడియాలు లేవు. మానసంరక్షణం అనేది మల్లమాంభతోనే పోయింది మనదేశంలో,' మొహంచాటు చేసుకుని అనుకున్నా నీమాటలు.

'సూర్యంగారూ! కూర్చోండి. మా అన్నయ్య ఇప్పుడే వస్తాడు.'

'ఏడిశావ్, ఏడిశావా అని, చెప్పిన బట్టకట్టుకోని ఏడు' అని లోపల అనుకొన్నా. ఈరకా లిలా

ఉన్నాయి. రాఘవుడు వొచ్చాడు. పుస్తకం పుచ్చుకొన్నా.

ఇంటికి పోతూ అనుకున్నాను. 'ఈపీనుగులేనా అందం, అందం అంటూ మహాగర్విస్తారు? అందంట. పరాయిమొగాడు పారేసుకున్న జేబురుమాలు దాచుకొని దాని తోటి ప్రణయతంత్రం నడపడం అందమా? కాలేజీ వరండాలమీద క్లాసుమేట్సుని ఢీకొట్టడం అందమా? పరాయి మొగాడింటికొస్తే బట్టిప్పుకొని మాట్లాడ్డం అందమా? బొత్తిగా హృదయవైశాల్యాలు లేవు.'

౮

ఇంటికొచ్చాను. అక్కగారి పాట వినిపించింది :

'కలభ సుందరగమన!

కస్తూరీ శోభితానన!'

ఆహాహా! పాపంపోగొట్టుకొన్నాను అనిపించింది.

* * *

రాత్రి గదిలో కెళ్ళేటప్పటికి లీల వొచ్చీరాని వరసతో రాఘవుడి రుమాలు గుండెలమీదేసుకుని

'అబుమై-సేజా-నా... హై-'

అని పాడుతోంది.

'రాఘవుడు రుమాలుకోసం వెతుక్కుంటున్నాడు' అన్నాను.

'ఈమాటొచ్చినప్పుడు నే నిచ్చేస్తా. అంత అజాగ్రత్తేంమనిషికి?' అని అంది.

'ఎంతజాణవే; కాలం!' అని అనుకున్నాను.

* * *

ఆవేళ దాసీది రాలేదు. చక్కగా తెల్లవారగట్ట నాలుగింటికి లేచింది సూరమ్మగారు

'హేరామ-హేకృష్ణ-ఇహానము త్రిప్త
దధిమధవసంజాత- మధురతరసంగీత
బుధజనావనఘోష-రమ్యఘోషం!'

హాయిదైన భూపాలరాగం-చక్కని స్పష్టమైన సంస్కృతశబ్దోచ్చారణ- వరండాలో కొచ్చి పవిత్రభావంతో వింటూ కూచున్నాను.

ఆరున్నరైంది. ఏడవొస్తోంది. గదిలో కెళ్లా. గుఱకెడుతోందిలీల.

కదిపాను. కుదిపాను. 'దాసీది రాలేదే' అన్నాను.

——ఉఁహు. బద్ధకం.

అదా అందం——ఇదా?...

# ప్రత్యుత్తరం అక్కర్లేని ప్రశ్నలు

'జనమేజయుడు'

స్వర్గంలో వుండేవారు అందరూ జరామరణవర్జితులనీ, వారికి అశ్వినీకుమారులు ప్రత్యేకవైద్యులనీ చెపుతారు. ముసలితనం, మరణం లేని వారికి వైద్యులతో పని ఏమిటి? పనిలేనిదే వైద్యుల్ని ప్రత్యేకంగా పెట్టుకోవడం ఎందుకు ?

... ... ...

నార్తు ఆర్కాటు జిల్లా ముఖ్యపట్టణం వెల్లూరు. వెస్టుగోదావరి జిల్లా ముఖ్యపట్టణం ఎల్లూరు. రెండు పట్టణాల నామాల మొదటి అక్షరాలు తేడాగావున్నయి. ఐనా రెండింటిని వేరు చెయ్యడానికిగాను నార్తు ఆర్కాటు జిల్లాకు చెందిన వెల్లూరును రాయవెల్లూరనీ, వెస్టుగోదావరి జిల్లాకు చెందిన ఎల్లూరును ఉప్పుఎల్లూరనీ అంటారు. మరోలా చెప్పతలిస్తే ఈవిషయం అరవదేశంలో వెల్లూరు రాయవెల్లూరు, ఆంధ్రదేశంలో ఎల్లూరు ఉప్పుఎల్లూరు అని అనాలి. అరవలికి రాయవెల్లూరు, ఆంధ్రులకి ఉప్పుఎల్లూరు—— ప్రబుద్ధాంధ్రులు సహించతగ్గదేనా ?

... ... ...

ఆంధ్రవిశారదులయిన తాపీ ధర్మారావు నాయుడు, బి.ఏ. గారు 'దేవాలయంమీద బూతుబొమ్మ లెందుకు?' అనే ప్రశ్నను శీర్షికగా తీసుకుని సుమారు ఎనభై పేజీల గ్రంథం వ్రాశారు కాని గ్రంథంలో ఆప్రశ్నకు ప్రత్యుత్తరం ఏమీ ప్రస్ఫుటంగా కనిపించదు. ఆశీర్షిక కూడా ప్రత్యుత్తరం అక్కరలేని ప్రశ్న అనే అనుకోవాలా ?